**COMMUNIST PARTY OF INDIA (MARXIST)**

**ANDHRA PRADESH COMMITTEE**

H.No. 27-28-12, CPI(M) State Committee Office
Yamalavari Street, Governor Pet, Vijayawada -2
☎ 0866 - 2577202, Fax: 0866 - 2577203
E-mail: cpimap@gmail.com

ప్రచురణార్థం/ప్రసారార్థం : విజయవాడ,

**తేది : 18 ఆగస్టు, 2022.**

## ఇంటిగ్రేటెడ్ యాప్‌ల భారం నుండి ఉపాధ్యాయులను మినహాయించాలి

## పూర్తిస్థాయి పర్యవేక్షణాధికారులను నియమించాలి

**– సిపిఐ(యం) డిమాండ్**

విద్యార్థులకు బోధన చేయాల్సిన ఉపాధ్యాయులను పలురకాల యాప్‌ల పేరుతో బోధనేతర కార్యక్రమాలకు కేటాయించడాన్ని, అధికారులు తీవ్రస్థాయిలో ఉపాధ్యాయులను ఒత్తిడికి గురి చేయడాన్ని సిపిఎం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ ఖండిస్తున్నది. ఈ పద్ధతి ఉపాధ్యాయుల్ని వేధించడానికి తప్ప విద్యా వ్యవస్థను సంస్కరించడానికి పనికి రాదు.

పాఠశాలల విలీనం పేరుతో విద్యారంగంలో గందరగోళ పరిస్థితులు సృష్టించిన ప్రభుత్వం, ఇప్పుడు తాజాగా యాప్‌ల పేరుతో ఉపాధ్యాయులను మానసిక ఆందోళనకు గురి చేయటం ద్వారా విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించలేదు. ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేయకుండా ఉన్న ఉపాధ్యాయులకే పనిభారాన్ని పెంచిన ప్రభుత్వం, అదనంగా యాప్‌ల పేరుతో బెదిరింపులకు దిగటం, విద్యార్థుల హాజరు సమయానికి నమోదు చేయలేదని ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు జారీ చేయటం తీవ్ర అభ్యంతరకరం. ప్రభుత్వం ఇవ్వాల్సిన డివైజ్‌లను పాఠశాలలకు సప్లయ్ చేయకుండా, ఉపాధ్యాయుల స్వంత మొబైల్ నుంచే 9 గంటల లోపు హాజరు నమోదు చేయాలని, లేకపోతే సాధారణ సెలవు కాకుండా ఇతర సెలవులను నమోదు చేయాలని, ఇ–హాజరు జీతాలకు లింకు చేస్తామని బెదిరింపులు చేయటం అప్రజాస్వామికం. ఇలాంటి నిరంకుశ చర్యలతో విద్యా వ్యవస్థ అస్తవ్యస్తమవుతుంది.

గడిచిన 4 సంవత్సరాలుగా పాఠశాలలని పర్యవేక్షణ చేయాల్సిన ఎంఇఓ, డివైఇఓ పోస్టులను సగానికి సగం ఖాళీగా ఉన్నాయి. ఈ పనికి కూడా సాంకేతికత పేరుతో ఉపాధ్యాయులపై ఒత్తిడి చేయడం బోధనకు ఆటంకం. ఉదయం పాఠశాల ప్రారంభం నుండి 14 రకాల యాప్‌లతో ఒకరిద్దరు ఉపాధ్యాయులు ఈ పనికే కేటాయిస్తూ ఉండగా, ఇప్పుడు అదనంగా ఫేస్ రికగ్నిషన్ యాప్‌ను ప్రవేశ పెట్టడం, ఉపాధ్యాయుల స్వంత మొబైల్ నుండి హాజరు నమోదుచేయాలని చెప్పటం ఉపాధ్యాయులను వేధింపులకు గురి చేయటమే. ప్రభుత్వ విధానాలను ఉపాధ్యాయులు విమర్శించకూడదని చెబుతున్న ప్రభుత్వం, విధానాలను రూపకల్పన చేసేముందు ప్రజాస్వామ్య పద్ధతిలో అందరితో చర్చించకపోవటం తీవ్ర అభ్యంతరకరం.

ఇప్పటికైనా ప్రభుత్వం ఉపాధ్యాయులపై యాప్‌ల భారం తొలగించి ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులతోబాటు పర్యవేక్షణాధికారి పోస్టులను భర్తీ చేయాలని, ప్రభుత్వమే డివైజ్‌లను ప్రతి పాఠశాలకు సప్లయ్ చేయాలని సిపిఐ(యం) కోరుతున్నది.

**(వి.శ్రీనివాసరావు)**
రాష్ట్ర కార్యదర్శి